క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హరేరామ హరేకృష్ణ మంత్ర జపపూజ

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫాక్స్ సాగర్ వద్ద ఛట్ పూజా సేవా సమితి ఆధ్వర్యంలో 24 గంటల పాటు హరే రామ.. హరే కృష్ణ మంత్ర జప పూజ ను చేపట్టారు. గత 31న ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ జపపూజ బుధవారం ఉదయం 10.30 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఛట్ పూజా సేవా సమితి అధ్యక్షుడు సంతోష్ ఠాకూర్, ప్రసన్న మిశ్రా, ముకుల్ సింహ, కిరణ్ రెడ్డి, చందన్ సారవ్‌సింగ్, సుశీల్‌కుమార్, రూపేష్, వినయ్‌సింగ్, సునీల్, దినేష్, ముఖేష్, సంతోష్ ఠాకూర్, ప్రమోద్ ఠాకూర్, గిరి దాదా, వికాస్, దిలీప్ అనిల్ తివారి, శ్రీనివాస్, షిండే తదితరులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌కు ఈటల పరామర్శ



నిజాంపేట్: తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ మాతృమూర్తి కాసాని కౌసల్య అంత్యక్రియలు బుధవారం బాచుపల్లిలో ముగిశాయి. కాసాని జ్ఞానేశ్వర్ కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, టీడీపీ నాయకురాలు సుహాసిని, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

స్క్రాప్ గోదాంలో అగ్ని ప్రమాదం

పూర్తిగా కాలిపోయిన గోదాం



జీడిమెట్ల: సుభాష్‌నగర్ గంపలబస్తీలోని ఓ స్క్రాప్ గోదాములో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కార్మికులు ఎవరూ గోదాములో లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. జీడిమెట్ల సీఐ పవన్ వివరాల ప్రకారం ... గంపలబస్తీకి చెందిన ఫరీద్ వివిధ పరిశ్రమల నుండి ప్లాస్టిక్ డ్రమ్ములు, కవర్లు కొనుగోలు చేసి అదే ప్రాంతంలో స్క్రాప్ గోదామును నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో గోదాము నుంచి పొగలు రావడాన్ని కొంతమంది స్థానికులు గుర్తించారు. రెండు నిమిషాల వ్యవధిలోనే గోదాములో సిలిండర్ పేలిన శబ్దం రావడంతో పాటు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న జీడిమెట్ల ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని గంటపాటు నీటిని, ఫోమ్ చిమ్మి మంటలను అదుపు చేశారు. గోదాములో ఉన్న స్క్రాప్ మొత్తం ప్రమాదంలో కాలిపోయింది. ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమ నిర్వహిస్తున్న గోదాం యజమానిపై జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానం



సుభాష్‌నగర్: సినీనటుడు రియల్‌స్టార్ శ్రీహరి సోదరుడు ఆర్.శ్రీధర్ కేంద్ర సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సూరారంలోని నార్త్‌సిటీ హైస్కూల్‌లో బుధవారం శ్రీధర్ స్నేహితుడు స్కూల్ కరస్పాండెంట్ కోల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో 1983 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అతడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

కార్పొరేటర్ పర్యటన

మియాపూర్: కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ వీకర్ సెక్షన్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయాలని కార్పొరేటర్ దృష్టికి కాలనీవాసులు తీసుకువెళ్లారు. ఆమె మాట్లాడుతూ.. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనుల నివేదికను రూపొందించాలని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఆమె వెంట చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, అధికారులు ఈఈ శ్రీకాంతిని,డీఈ ప్రవీణ్, ఏఈ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

కొంపల్లి మున్సిపాలిటీలో

బెడిసికొట్టిన అవిశ్వాసం



- జీఆర్ఎస్ కౌన్సిలర్లతో రహస్య చర్చలు
- సున్నితంగా తిరస్కరించిన కౌన్సిలర్లు
- ఫెయిలైన బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్ల ప్లాన్

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం విషయంపై కౌన్సిలర్ల భేటీ బెడిసి కొట్టింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు పలువురు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లతో రహస్య చర్చలు జరపగా వారు సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇద్దరు కలిసి గతంలో ఇక్కడ మున్సిపల్ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించారు.. టికెట్ల కేటాయింపులు మొదలుకుని వర్గాల వారీగా విడిపోయి గెలుపు ఓటములపై ప్రభావం చూపేలా పనిచేశారు.

◆ మూడు సంవత్సరాల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ తొమ్మిది స్థానాల్లో గెలుపొందగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు 9 మంది గెలవడంతో ఎక్స్ అఫీషియో సభ్యుల ఎంపిక కీలకంగా మారింది. దీంతో పార్టీ అధిష్టానం సూచన మేరకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరు తమదైన శైలిలో ఇక్కడ పావులు కదిపి చైర్మన్‌గా సన్న శ్రీశైలంయాదవ్‌ను ఎంపిక చేసి చక్రం తిప్పారు.

కాంగ్రెస్ కౌన్సిలర్లు చేరడంతో పెరిగిన బీఆర్ఎస్ బలం...

◆ కొంపల్లి మున్సిపల్ పాలకవర్గం సమావేశాలు జరుగుతుండగా మెజార్టీ కౌన్సిలర్లు లేకపోవడంతో చైర్మన్‌గా వ్యవహరించిన సన్న శ్రీశైలంయాదవ్ తన వర్గాన్ని పెంచుకునేలా పావులు కదిపి కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్‌గా కొనసాగుతున్న చింతల రవీందర్‌యాదవ్, జల్ద మంజుల కుమార్‌గౌడ్ బీఆర్ఎస్ పార్టీలో చేరేలా చక్రం తిప్పారు. దీంతో బీఆర్ఎస్ బలం 11కు చేరింది.

చైర్మన్‌పై ఒత్తిడి పెంచేలా..

◆ పూర్తి మెజారిటీతో కౌన్సిలర్లు తాజాగా కొంతమంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపి చైర్మన్ శ్రీశైలంయాదవ్‌పై ఒత్తిడి పెంచేలా ప్రయత్నించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆదేశాలు ఉంటేనే తాము అవిశ్వాస తీర్మానం పెడతామని స్పష్టం చేయగా కొందరు వేసిన వ్యూహం బెడిసికొట్టిందని చెప్పుకోవచ్చు. ఏది ఏమైనా బలమైన వ్యతిరేకవర్గం ఉంటేనే ఇక్కడ అవిశ్వాస తీర్మానంపై కౌన్సిలర్లు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



కళ్లద్దాలు అందజేస్తున్న దుండిగల్ కమిషనర్ సత్యనారాయణరావు

దుండిగల్: కంటి సమస్యలను శాశ్వత పరిష్కారం చూపేందుకే రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగును తీసుకొచ్చిందని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. బుధవారం దుండిగల్ వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా కళ్లద్దాలు అందజేసిన కమిషనర్ మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలతో పాటు శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు కొనసాగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ నిర్మల, మున్సిపల్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

నిర్బంధించి దాడి చేశారని వ్యక్తి ఫిర్యాదు

జీడిమెట్ల: తన భూమిలోకి రావడమే గాక తనని నిర్బంధించి దాడి చేశారని ఓ వ్యక్తి జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారంలోని సర్వే నం.419, 420లో సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తికి 10గుంటల స్థలం ఉంది. సదరు స్థలంలో సుధాకర్‌రెడ్డి ఓ కంటైనర్‌ను ఏర్పాటు చేసి తన బంధువులను అక్కడే ఉంచాడు. మంగళవారం రాత్రి కొంతమంది సదరు స్థలంలోకి రావడంతో విషయం తెలుసుకున్న సుధాకర్‌రెడ్డి అక్కడకు చేరుకున్నాడు. ఇంతలో ఓ ప్రైవేట్ యూనివర్సిటీకి చెందిన వ్యక్తులు అక్కడకు వచ్చి తనను నిర్బంధించి దాడి చేశారని సుధాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.24వేల కనీస వేతనాన్ని అమలు చేయాలి

ఏఐటీయూసీ నాయకులు ఏసురత్నం



పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమైన ఏఐటీయూసీ నాయకులు ఏసురత్నం తదితరులు

రంగారెడ్డినగర్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ అధ్యక్షుడు ఏసురత్నం అన్నారు. ఈ నెల 3న మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో హైదరాబాద్ నేపథ్యంలో బుధవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్మికులతో ఆయన సమావేశమయ్యారు.

◆ ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రూ.24వేల కనీస వేతనాన్ని అమలు చేయాలని, అసెంబ్లీ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన విధంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు, పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్‌కలెక్టర్లు, డ్రైవర్లను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

◆ అదే విధంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులకు నెలకు రూ.3 నుంచి 4వేల రవాణా ఖర్చు అవుతోందన్నారు. వారికి అనుకూలంగా ఉన్న దగ్గర ప్రాంతాల్లో డ్యూటీలు వేయాలని కోరారు. చలో హైదరాబాద్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు రాములు, శేఖర్, జంట సర్కిళ్ల అధ్యక్ష, కార్యదర్శులు హరినాథరావు, శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాలు చేపట్టే నిర్మాణాలను అమాయకులు కొనుగోలు చేసి మోసపోవద్దని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. గాజులరామారంలోని ప్రభుత్వ స్థలంలో వెలిసిన పలు నిర్మాణాలను బుధవారం నేలమట్టం చేశారు. దేవేందర్‌నగర్ సర్వే నం.329/1లో నాలుగు గదులు, 10 బేస్‌మెంట్లు, 342 మంజూర్‌నగర్‌లో 8 బేస్‌మెంట్లు, మెట్‌కానిగూడలో ఒక గదిని కూల్చి వేశారు.

సీసీరోడ్డు క్యూరింగ్ పనుల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని న్యూ అల్లాపూర్‌లో ఎస్‌డీ ఫంక్షన్‌హాలు పక్కన వీధిలో జరుగుతున్న సీసీరోడ్డు క్యూరింగ్ పనులను బుధవారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. సీసీరోడ్డు పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తి చేశామని ఆమె అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ను స్థానికులు సన్మానించారు. పాత రోడ్లతో అనేక ఇబ్బందులు పడ్డామని.. కార్పొరేటర్ మాట ఇచ్చి నెరవేర్చారని కృతజ్ఞతలు తెలిపారు. నజీర్ అజీజ్, ఇస్మాయిల్, రఫియా బేగం, యూసఫ్ పాల్గొన్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్ అవినీతిపై చర్చకు సిద్ధమా?



ప్రగతినగర్ మూడు కోతల బొమ్మ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో నిధుల కేటాయింపు, మౌలిక వసతుల కల్పన, అవినీతిపై ఎమ్మెల్యే చర్చకు సిద్ధమా అని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ సవాల్ విసిరారు. బుధవారం ప్రగతినగర్‌లోని మూడు కోతుల బొమ్మ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రెండేళ్లుగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.350 కోట్ల రెవెన్యూ వస్తే స్థానికంగా అభివృద్ధికి కేవలం రూ.50 కోట్ల నిధులను ఇవ్వడం దారుణమన్నారు. రాష్ట్రంలో వసూలవుతున్న ట్యాక్స్‌లను కేంద్ర ప్రభుత్వం వాడుకుంటోందని గగ్గోలు పెడుతున్న పురపాలక మంత్రి కేటీఆర్ నిజాంపేట్ కార్పొరేషన్‌లో వసూలవుతున్న టాక్స్‌లను ఇక్కడ ఎందుకు ఖర్చు చేయడం లేదని ప్రశ్నించారు.

▲ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినా ప్రత్యేక గ్రాంట్ కింద రూ.10 కోట్లు ఇవ్వలేదన్నారు. ఇప్పటి వరకు డివిజన్‌కు రూ.2 కోట్లు కేటాయిస్తే ఎక్కడ అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్పొరేషన్ పరిధిలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని, వందలాది ప్రభుత్వ భూమి ఉన్నా మినీ స్టేడియాన్ని, మోడల్ మార్కెట్‌ను నిర్మించలేదన్నారు.

▲ ఈ నిరసన కార్యక్రమంలో పార్లమెంట్ కోకన్వీనర్ డాక్టర్ రాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర జాయింట్ కన్వీనర్ దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి భిక్షపతి యాదవ్, సెక్రటరీ సత్యనారాయణ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అశోక్‌నాయక్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాము, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మదన్‌గౌడ్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, 14వ డివిజన్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ శేషారావు, సీనియర్ నాయకులు వీరెల్లి లక్ష్మయ్య, పురుషోత్తం, సాయి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమృతాలయ అష్టమవార్షిక బ్రహ్మోత్సవం



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: చింతల్ గణేష్‌నగర్‌లోని అమృతాలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అభిషేక పూజలో పాల్గొన్నారు. అనంతరం కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌లు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు. దైవ నామస్మరణతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లింగంయాదవ్, దుర్గారావు, బొడ్డు వెంకటేశ్వర్‌రావు, వెంకటేష్, యాదగిరి, గణేష్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శివ మహా పడిపూజ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ద్వాదశ జ్యోతిర్లింగ శివ మహా పడిపూజ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్: గాజులరామారం నల్లగుట్టపై ఉన్న శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 5న ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న ద్వాదశ జ్యోతిర్లింగ శివ మహా పడిపూజకు రావాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దూదిమెట్ల సోమేష్‌యాదవ్, శివ స్వాములు ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం శివమహా పడిపూజకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎత్తరి మారయ్య, కష్టాయాదవ్, శివ స్వాములు తదితరులు ఉన్నారు.

దేశ ప్రగతికి దోహదపడే బడ్జెట్

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడుగు బలహీనవర్గాలకు ఊతం ఇచ్చి, దేశ ప్రగతికి దోహదపడేలా ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం అత్యంత ప్రాధాన్యమిస్తూ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద రూ.79వేల కోట్ల నిధులు కేటాయించడం గొప్ప విషయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద ప్రజలు, మధ్య తరగతి ప్రజలు, రైతులతో సహా అందరి ఆకాంక్షలు, కలలను నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి, సంక్షేమంతో పాటు గొప్ప సంకల్పాన్ని నెరవేర్చే బడ్జెట్‌ని ప్రవేశ పెట్టిన ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లకు శ్రీశైలం గౌడ్ ధన్యవాదాలు తెలియజేశారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులకు తోడు తల్లిదండ్రులు దూరంగా ఉన్నారన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ నాడియా జిల్లా హరిపురిపాద గ్రామానికి చెందిన షేక్ నజీబుల్ (20) పెయింటింగ్ అండ్ టైల్స్ కాంట్రాక్టర్ దీపేశ్‌కుమార్ వద్ద కూలిగా పని చేస్తున్నాడు. గుండ్లపోచంపల్లి లేబర్ కాలనీలో అపర్ణ మేరీగోల్డ్ అపార్ట్‌మెంట్‌లో దీపేశ్‌కుమార్ కూలీలతో పనులు చేయిస్తున్నాడు. అపార్ట్‌మెంట్ సమీపంలో షెడ్‌లు వేసుకుని కూలీలు అందులో నివాసముంటున్నారు. గతనెల 31వ తేదీన ఉదయం 8.30 గంటలకు డ్యూటీకి వచ్చిన నజీబుల్‌ను లేబర్‌కార్డు లేకపోవడంతో సెక్యూరిటీ గేటు వద్దనే నిలిపివేశాడు.

◆ ఈ క్రమంలో ఉదయం 10.40 గంటలకు దీపేశ్ కుమార్ పనికి ఎందుకు రాలేదని నజీబుల్‌కు ఫోన్ చేయగా లేబర్ కార్డు లేదని సెక్యూరిటీ ఆపేశాడని.. టైమ్ కూడా మించి పోయిందని.. గదిలో రెస్ట్ తీసుకుంటున్నానని చెప్పాడు. ఈ క్రమంలో సాయంత్రం 4.30 గంటల సమయంలో తోటి కూలి అఖిబుర్ రహమాన్ పని తొందరగా ముగించుకుని షెడ్డుకు వచ్చి తలుపు తట్టగా ఎంతకీ తలుపు తీయలేదు. దీంతో అనుమానం వచ్చి డోర్ సందులో నుంచి చూడగా నజీబుల్ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఈ విషయాన్ని దీపేశ్‌కుమార్‌కు తెలియజేయగా వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డోర్ తెరిచి కిందకు దించగా అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లు అధ్వానం.. జనం ఆగ్రహం

- కేబుల్ లైన్ ఏర్పాటుకు రోడ్లు తవ్విన వైనం
- మట్టి, కంకర పోసి వదిలేయడంతో అధ్వానంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



దుండిగల్: అభివృద్ధి పనుల కోసం రోడ్ల తవ్వకాలు చేపట్టి.. ఆ తరువాత కంకర పోసి చేతులు దులుపుకోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కల్గుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. దుండిగల్ మున్సిపాలిటి పరిధి భౌరంపేట్‌లోని బొడ్రాయి నుంచి ప్రణవ్ బ్లూమ్స్ వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కేబుల్ లైన్ వేసేందుకు రోడ్డును తవ్వి పనులు పూర్తి చేశారు. తిరిగి రోడ్డుకు మరమ్మతులు చేపట్టకుండా కేవలం పైపైన మట్టి, కంకర వేసి వదిలేశారు. దీంతో రోడ్డంతా గుంతలతో అధ్వానంగా మారింది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం..

శంభీపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రోడ్డు, భౌరంపేట్ గ్రామానికి వెళ్లే రోడ్లు కంకర తేలి ఉండటంతో వాహనదారులు జారి పడుతున్నారు. గుంతలు ఏర్పడటంతో స్కూల్ బస్సులు, కార్లు తరచూ దిగబడుతున్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని భౌరంపేట్ వాసులు ఆరోపిస్తున్నారు.

డీపీఎస్ రోడ్డులో వెలగని వీధి దీపాలు

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్) రోడ్డులో రాత్రి వేళ వీధి దీపాలు వెలగకపోవడంతో అటుగా రాకపోకలు సాగించే కాలనీల ప్రజలు చుక్కలు చూస్తున్నారు. ఈ రోడ్డు గుండా వెళ్లే క్రమంలో జారిపడి ఆస్పత్రుల పాలైన ఘటనలు కొకొల్లలు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ, రోడ్లు భవనాల శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రోడ్డు దృశ్యం



కంకర తేలిన శంభీపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు



భౌరంపేట్ గ్రామానికి వెళ్లే రోడ్డులో గుంతలు